వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రద్దుకు పోరాడదాం
• తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ 7

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలి: జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జేసీ బి.నవ్య అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌లో లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 8, కర్నూలు ఆర్డీవో వద్ద 3, పత్తికొండ ఆర్డీవో వద్ద 3, కలెక్టరేట్ ఏవో వద్ద, 3, సర్వే ఏడీ, కార్మిక శాఖ, ఐసీడీఎస్ పీడీ వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్‌ఏలో వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ వెబ్ ఆప్షన్లు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా కళాశాలలను బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవడానికి వెబ్ ఆప్షన్లు ప్రారంభమైనట్లు పాలిసెట్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. జూలై 6న వెబ్ ఆప్షన్ల మార్పు, 9న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. సీట్లు పొందిన విద్యార్థులు 10 నుంచి 14వ తేదీలోపు కళాశాలలో చేరాలని ఆయన తెలిపారు. జూన్ 30 నుంచి జూలై 1వ తేదీ వరకు 1 నుంచి 50వేల ర్యాంకు వరకు, 2, 3 తేదీల్లో 50,001 నుంచి 90వేల ర్యాంకు వరకు, జూలై 4, 5 తేదీల్లో 90,001 నుంచి చివరి ర్యాంకు వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పాలిసెట్ కన్వీనర్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు.

నేటి నుంచి 'వాయిదా పడిన డీఎస్సీ పరీక్షలు'

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షలను జూలై 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ సోమవారం తెలిపారు. పరీక్షా కేంద్రాలు, తేదీలు మార్చిన కొత్త హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు. అభ్యర్థులు వెంటనే హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకుని పరీక్షా కేంద్రాలను, తేదీలను నిర్ధారించుకోవాలని సూచించారు.

కందనవోలుది ఘనకీర్తి



కర్నూలు జిల్లాకు 167 ఏళ్లు

రాయలసీమ ముఖద్వారం కర్నూలు.. రాజులు, చక్రవర్తులు, నవాబులు, పాలేగాళ్లు పాలించిన నేల ఇది. బ్రిటీష్ పాలకులు భరత గడ్డపై అడుగు పెట్టాక వారి పెత్తనాన్ని సవాల్ చేస్తూ తొలి తిరుగుబాటుకు బీజం వేసిన ఘనచరిత్ర మనది. పాలేగాళ్ల పాలనకు స్వస్తి చెప్పాలని రాయలసీమ జిల్లాలను దత్త మండలాలుగా ప్రటించారు. పాలన సౌలభ్యం కోసం బ్రిటీష్ పాలకులు జిల్లాలను ఏర్పాటు చేశారు. మొదట కడప, బళ్లారి జిల్లాలు ఉండేవి. ఆ తరువాత కర్నూలు జిల్లా 1858 జూలై 1న ఆవిర్భవించింది. నేటితో 167 వసంతాలు పూర్తి చేసుకున్న కర్నూలు జిల్లా ఘనచరిత్రపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- 1858లో జిల్లాగా ఆవిర్భావం
- ఆంధ్ర రాష్ట్ర మొదటి రాజధాని కర్నూలు
- మార్కాపురం, కంభం, ఎర్రగొండపాలెం కందనవోలులో భాగమే
- ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు 1953లో కర్నూలు జిల్లాలో విలీనం
- నేటి కేఎంసీ ఫోరెన్సిక్ భవనమే నాటి కలెక్టర్ బంగ్లా
- ప్రప్రథమంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు జిల్లా వాసులే
- తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య మనవారే
- నేడు కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలకులు దత్త మండలాల(రాయలసీమ జిల్లాలు)ను 1801లో కడప, బళ్లారి రెండు జిల్లాలుగా చేశారు. ప్రస్తుత ఉమ్మడి కర్నూలు జిల్లా సగ భాగం కడపలో, మరో సగభాగం బళ్లారి జిల్లాలో ఉండేవి. అంతకుముందు 1800 నవంబరు 1న థామస్‌మన్రో దత్త మండలాలకు ప్రధాన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఆతరువాత నాలుగు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. 1858లో కడప జిల్లా నుంచి విడిపోయి కర్నూలు జిల్లా, బళ్లారి జిల్లా నుంచి కొంత భాగం విడదీసి అనంతపురం జిల్లాను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ విభాగం నిర్వహిస్తున్న భవనమే కర్నూలు జిల్లా తొలి కలెక్టర్ బంగ్లా. కర్నూలు, నందికొట్కూరు, రామళ్లకోట, పత్తికొండ, నంద్యాల, శిరువెళ్ల, మార్కాపురం, కంభం తాలుకాలు కలిపి కర్నూలు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చే వరకు జిల్లా స్వరూపంలో ఏ మార్పు రాలేదు. స్వాతంత్ర్యం తరువాత కూడా బనగానపల్లె సంస్థానం కొన్నాళ్లు స్వతంత్రంగానే ఉన్నా.. 1948 సెప్టెంబరు 18న కర్నూలు జిల్లాలో అంతర్భాగం అయ్యింది. 1953లో మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి.. కర్నూలు రాజధాని కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది. అదే ఏడాది అక్టోబరు 1న బళ్లారి జిల్లా నుంచి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు తాలుకాలను విడదీసి కర్నూలులో విలీనం చేశారు. అయితే.. రాయలసీమ (దత్త మండలాలు)లో భాగమైన బళ్లారిని కోల్పోక తప్పలేదు.





జిల్లాల పునర్విభజన తరువాత..

కేంద్ర ప్రభుత్వం 1971లో జిల్లాలు పునర్విభజన చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కాపురం, గిద్దలూరు, కంభం, ఎర్రగుండపాలెం నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలో కలిపేశారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలతో కర్నూలు మిగిలింది. నియోజకవర్గాల పునర్విభజనతో కోవెలకుంట్ల కనుమరుగై పాణ్యం, మంత్రాలయం నియోజకవర్గాలు ఏర్పాడ్డాయి. ఆత్మకూరు స్థానంలో శ్రీశైలం నియోజకవర్గం వచ్చింది. 2022లో జిల్లాలో పునర్విభజనతో 167 ఏళ్ల పాటు కర్నూలు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న నంద్యాల కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడింది. కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గంలోని రెండు మండలాలలో కర్నూలు జిల్లా మిగిలింది. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలతో నంద్యాల జిల్లా ఏర్పడింది.

తొలి తిరుగు బాటు..

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ పాలకుల వార్ రూంలోకి మన జిల్లాకు చెందిన రాజ నీతిజ్ఞుడు ఆర్కాట్ రామస్వామి మొదిలియర్ ఆహ్వానం పలికారు. జిల్లాకు చెందిన తెర్నేకల్లు ముత్తుకూరు గౌడప్ప, కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్, పాలేగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా తొలి తిరుగుబాటు చేశారు. 1908లో జిల్లాకు చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు బ్రిటీష్ పాలకులు తొలి రాజకీయ ఖైదీగా అరెస్టు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత కర్నూలు చెందిన సర్దార్ నాగప్ప రాజ్యంగ సభకు ఎన్నికై రాజ్యాంగ నిర్మాణంలో సభ్యుడు అయ్యారు.

మిగతా 7వ పేజీలో

రోగులను బయటికి పంపితే చర్యలు

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలు జీజీహెచ్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మందుల కోసం రోగులను బయటికి పంపితే కఠిన చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో కర్నూలు జీజీహెచ్ వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో నిర్వహించిన అంశాల వారీగా చర్చించి వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో విద్యుత్ సమస్య ఎక్కడ ఉండకూడదని, ఏఎంసీ, గైనిక్, సూపర్ స్పెషాలిటీ, ఓటీల్లో యూపీఎస్ కనెక్షన్ ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పీజీ హాస్టల్స్ వద్ద, స్ట్రీట్ లైటింగ్, పెద్ద పెద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మను ఆదేశించారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో నిధులు ఉన్నప్పటికీ పరికరాలు కొనుగోలు చేసేందుకు అనుమతులు కావాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.పృథ్వీ వెంకటేశ్వర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం పూట రద్దీ ఎక్కువగా ఉంటుందని, హాస్పిటల్‌లో పార్కింగ్ స్థలాలను మెరుగు పరచాలని మంత్రి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును ఆదేశించారు. వైద్యులు, రోగులు, ఉద్యోగులు విద్యార్థులకు వాహనాలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఉండాలన్నారు. హాస్పిటల్‌లో లీకేజీ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

త్వరలో ఏడో రాష్ట్ర స్థాయి సదస్సు

కర్నూలు హాస్పిటల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ)లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పెథాలజీ, మైక్రోబయాలజీ (ఐఏపీఎం) ఆధ్వర్యంలో త్వరలో ఏడో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ తెలిపారు. సోమవారం కాలేజీలోని పెథాలజి విభాగాన్ని ప్రిన్సిపాల్ పరిశీలించారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల జిల్లాల నుంచి వైద్యులు వస్తారన్నారు. వాల్ పెయింటింగ్‌లను పరిశీలించి అనంతరం పెథాలజి హెచ్‌వోడీ డా.బాలేశ్వరితో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హేమలత, అసోసియేట్ ప్రొఫెసర్ రేవతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు షహనాజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి

- 3 నుంచి 8 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయొద్దు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపులోని ఎంపీయూపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని బి.క్యాంపు ఎంపీయూపీ పాఠశాల ఎదుట సోమవారం తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ పాఠశాలలోని 3 నుంచి 8 తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. ఈ పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని, అలాంటి పాఠశాలలోని తరగతులను ఇతర పాఠశాలలో తరలించడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుబట్టారు. అక్కడికి చేరుకున్న డీఈవో శామ్యూల్ పాల్ విద్యార్థుల తల్లిదండ్రులను నచ్చజెప్పడానికి అనేక ప్రయత్నాలు చేశారు. హైస్కూల్‌లో తరగతులు విలీనం చేయడం వల్ల అక్కడ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పాటు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఉంటాయని, దీని వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. పాఠశాల విలీనం తమ చేతుల్లో లేదని, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిబంధనల మేరకు తరగతులను ఇతర పాఠశాలలో విలీనం చేశామని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనలు విరమించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 135 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..: తాను లండన్‌లో హోటల్ మేనేజర్‌గా పని చేస్తున్నానని, సోషల్ మీడియాలో పరిచయమైన కడప జిల్లాకు చెందిన ఒక మహిళ ప్రేమ పేరు చెప్పి రూ.35 లక్షలు తీసుకొని మోసం చేసిందని కొత్తపేటకు చెందదిన మునీర్ అహ్మద్ ఖురేషీ ఫిర్యాదు చేశారు. తన నెంబర్ బ్లాక్‌లో ఉంచిందని చెప్పారు. కర్నూలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్, వార్డెన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశారని మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన రాజు, మునిస్వామి ఫిర్యాదు చేశారు. పూణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామి సంవత్సరానికి రూ.5 లక్షలు ప్యాకేజీ అని కడప చెందిన అశోక్ కుమార్ రూ.1.50 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంటు లెటర్ ఇచ్చి బోర్డు మీటింగ్, ప్రాజెక్టు వర్క్ చేయించి ట్రైనింగ్ ఇప్పించి మోసం చేశారని కర్నూలు మాధవీనగర్‌కు చెందిన చంద్రకళ ఫిర్యాదు చేశారు. జిషింత్ రాణి, శ్రేయాస్‌లు కలిసి మా ఇద్దరి పిల్లలకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.4.30 లక్షలు తీసుకుని బోగస కంపెనీలో ఉద్యోగం ఇప్పించి మోసం చేశారని కర్నూలు ఉద్యోగ నగర్‌కు చెందిన ఆర్.ప్రకాష్ రాజ్ ఫిర్యాదు చేశారు.

'లీజు' పేరిట కన్నేశారు..!



కర్నూలు కలెక్టరేట్ వద్ద వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి డి-పట్టా రైతుల ఆందోళన

- మూడు తరాలుగా సాగులో నిరుపేదలు
- 2005లో 276 ఎకరాలకు డి-పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం
- ఇరవై ఏళ్ల తరువాత ఆ భూముల్లో లీజు పేరిట వాలిన గద్దలు
- కర్నూలు కలెక్టర్‌ను ఆశ్రయించిన పుల్లగుమ్మి పేద రైతులు

కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూడు తరాలుగా నిరుపేదల సాగులో ఉన్న ప్రభుత్వభూములు అవి. వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాగు పట్టాలు ఇచ్చి భూయాజమాన్య హక్కు కల్పించాలని దశాబ్దాలుగా పాలకులను విన్నవిస్తున్నారు. 2005లో ఆనాటి ప్రభుత్వం సాగులో ఉన్న నిరుపేదలను గుర్తించి దాదాపు 276 ఎకరాలు 200 మందికి రైతులకు డి-పట్టాలు ఇచ్చి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. లబ్ధిదారులు బ్యాంకుల్లో పంట రుణాలు కూడా పొందారు. ఆ భూముల్లో సేద్యం చేస్తూ.. కూలీ పనులు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్న పేదల గుండెల్లో 'లీజు' గునపం దింపేస్తున్నారు. ఈ భూముల్లో మాకు మైనింగ్ లీజులు ఉన్నాయి.. ఖాళీ చేయాల్సిందే అంటూ పెద్దలు గద్దల్లా వాలిపోయారు. దిక్కుతోచని డి-పట్టా రైతులు న్యాయం చేయాలంటూ సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను ఆశ్రయించారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు ఫిర్యాదు చేశారు. 'తాతల కాలం నుంచి మూడు తరాలుగా ఆ భూముల్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం.. ఇరవై ఏళ్ల తరువాత వచ్చి లీజు ఉంది.. ఖాళీ చేయాలనడం ఎంత వరకు న్యాయం..? అంటున్న పేద రైతుల కన్నీటి వేదన ఇది.



డి-పట్టా భూముల్లో రైతులు సాగు చేస్తున్న పంటలు

కర్నూలు జిల్లా కల్లూరు మండలం యాపర్లపాడు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 238/ఏ పరిధిలో సుమారు 1,500 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి.

మిగతా 7వ పేజీలో

గందరగోళంగా ఏఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్

ప్రక్రియను అడ్డుకున్న ఉద్యోగులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3 బదిలీల కౌన్సెలింగ్ గందరగోళంగా జరిగాయి. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో కౌన్సెలింగ్ ఉదయం 7 గటలకు జరగాల్సి ఉండగా.. ఆలస్యంగా మొదలైంది. మొదలైన కొద్దిసేపటికే ఎంపీహెచ్ఏ (ఫీమేల్) డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళను కలిశారు. రీడిప్లాయిమెంటులో ఉన్న స్థానాలు ఖాళీలు చూపించాలని తాము జీతాలు డ్రా చేస్తున్న ఒరిజినల్ సబ్ సెంటర్లను ఖాళీగా చూపించొద్దని రీడిప్లాయిమెంట్ రద్దు చేయాలని డీఎంహెచ్‌వోను కోరారు. దీనిపై డీఎంహెచ్‌వో వివరణ ఇస్తూ మీ సబ్ సెంటర్ల ఖాళీలు అలాగే ఉంటాయని, ఆస్థానాలకు ఏఎన్ఎం-గ్రేడ్-3లను పంపించామని హామీ ఇచ్చారు. అనంతరం ఏఎన్ఎం గ్రేడ్-3 కౌన్సెలింగ్ సాగింది. ర్యాంకుల వారీగా ముందు, ఆ తర్వాత విడుదల చేసిన జాబితా, వెకెన్సీ సీనియారిటీ జాబితా, రెండు, మూడుసార్లు మార్చడంతో అభ్యర్థులు ఇక్కట్లు పడ్డారు. సొంత మండలాలు కాకుంటే అదే మండలంలో ఉన్న పక్క పీహెచ్‌సీకి పంపాలని ఉద్యోగులు కోరారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. పది నిమిషాలు కౌన్సెలింగ్ నిలిచిపోయింది. అధికారులు, యూనియన్ నాయకులు కొన్ని స్థానాలను దాచి పెట్టారని కొందరు ఆరోపిస్తున్నారు. రాత్రి 10:30గంటల వరకు 300 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

టెండర్లు పిలవడం విడ్డూరం

జాయింట్ కలెక్టర్‌కు రైతుల వినతి


జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న హాలహర్వి రైతులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు కేసు కొట్టివేయడంతో భూములు సాగు చేసుకునేందుకు ఇవ్వకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు తిరిగి టెండర్లకు పిలవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు అధికారుల తీరును నిరసిస్తూ నంద వరం మండలం హాలహర్వి గ్రామ రైతులు యాపిలయ్య, గుంటెప్ప, కౌలుట్ల స్వామి, నాగరాజు, అసురఖాన ముతావల్లి ముల్లా ఖాశీం సాహెబ్, మహబూబ్ బాషా, నజీర్ అహ్మద్, అల్లాబకాష్ సోమవారం జేసీ నవ్యకు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాలహర్వి గ్రామంలో సర్వే.నెంబర్: 254, 534, 887లో 85.83 ఎకరాల అసురఖానకు చెందిన వక్ఫ్ భూమి ఉందన్నారు. ఈభూములకు 2021 జూన్ 30న టెండర్లు పిలవగా గ్రామానికి చెందిన తాము రూ.5,71,000 గుత్త చెల్లించే విధంగా వేలంపాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. డబ్బులు కూడా డిపాజిట్ చేశామన్నారు. 2021 జూన్30న గ్రామానికి చెందిన కొంత మంది హైకోర్టును ఆశ్రయిం చడంతో అధికారులు భూ ములను రైతులకు సాగుకు ఇవ్వకుండా ఆపేశారన్నారు. దీనిపై వక్ఫ్ బోర్డు అధికారులు సవాల్‌చేసి 2023లో కోర్టులో విజయం సాధించినట్లు తెలిపారు. అప్పటి నుంచి తాము భూములు సాగుకు ఇవ్వాలని పలు మార్లు వక్ఫ్‌బోర్డు అధికారులను కలిసి విన్నవించినా వారినుంచి ఎలాంటి చలనం లేదన్నారు. తమకు వక్ఫ్ భూములను సాగుకు ఇవ్వక పోగా, తాము చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించకుండా కొత్తగా 2025 జూలై 2న వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులను మోసం చేస్తూ అధికా రులను తప్పుదోవ పట్టిస్తూ వేలం పాటలు నిర్వహించేందుకు సిద్ధమైన వక్ఫ్ బోర్డు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి: విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆదోనిలోని ఓ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడ రేషన్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ నవ్యకు వినతి పత్రం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఆ కళాశాల పాటించడం లేదని ఆరోపించారు.

● వికలాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం కల్పించాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల యువసేన అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు జేసీకి వినతి పత్రం సమర్పించారు.

● కర్నూలు నగరంలోని బీక్యాంపు ప్రభుత్వ హాస్టల్ ఆనంద నిలయానికి చెందిన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు వార్డెన్‌పై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ నగరంలోని బీ.క్యాంపులో ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ వసతి గృహం ఆనంద నిలయంలో ఉంటూ చదువుతున్నారు. కానీ మీకు ఇక్కడ హాస్టల్ లేదు.. మీరు ఎక్కడైనా చేరండని మా పిల్లలకు వార్డెన్ హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు.

● వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామ పంచాయతీ గుంటుపల్లె గ్రామంలో సర్వేనెంబర్.347/బి2, 347/ఏ-1, 347-బీ1, 374/బి2 3347/ఏ2, 240-ఏ2, 374-ఏ1 ప్రభుత్వ భూములను కొంత మంది అన్యాక్రాంతం చేసుకున్నారని గుంటుపల్లె రైతులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

చట్టసభలపై అవగాహన కల్పించడం అభినందనీయం: టీజీ


మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టసభలపై అవగాహన కల్పించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. దేశంలో అప్పటి కాంగ్రెస్ ప్రభు త్వం ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన మాక్ పార్ల మెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ హాజరై ప్రసం గించారు. కొన్ని ప్రశ్నలు వేసి సమాధా నాలు చెప్పిన వారికి టీజీ నగదు ప్రోత్సా హకాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు గీతామా ధురి, నిర్మల కిషోర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కేవీసుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలత పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ క్యూసీ ఇన్‌చార్జి డీఈగా మధుసూదన్

కర్నూలు న్యూసిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యుఎస్ (గ్రామీణ నీటి సరఫరా విభాగం) కర్నూలు జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఇన్‌చార్జి డిప్యూటీ ఇంజనీర్‌గా బీవీ మధుసూదన్‌ను నియమిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఆయనను క్యూసీ డీఈగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్త ర్వుల్లో పేర్కొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ కుషికుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.

రికార్డుల పరిశీలన

సి.బెళగల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల రికార్డులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ సోమవారం పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2024, 2025 సంవత్సరాలలో గ్రామాల్లో చేసిన ఉపాధి పనులకు బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: కమిషనర్


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారరంలో జాప్యం చేయరాదని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిష నర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వే శ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ లీలప్రసాద్, ఆర్ఓ జునైద్ పాల్గొన్నారు.

● నగరంలో రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మకు విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సి.శేషాద్రి, రాముడు, జయమ్మ పాల్గొన్నారు.

● 43, 44 వార్డులలో కలుషిత నీరు వస్తుందని తక్షణమే అరికట్టి ప్రజలకు ఫిల్టర్ నీటిని అందించాలని సీపీఎం జిల్లా నాయకురాలు పి.నిర్మల కోరారు. కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. నిర్మల మాట్లాడుతూ ఇందిరాగాంధీ నగర్, పీవీ నరసింహారావు, ఇల్లూరునగర్, సీతారం నగర్, ఎస్‌బీఐ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీల్లో గత రెండు రోజులుగా వండ్రుతో కూడిన కలుషిత నీరు కొళాయిల ద్వారా వస్తున్నాయని కమిషనర్‌కు నీటిని చూపిం చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాముడు, సి.గురుశేఖర్, పీఎస్. సుజాత, సావిత్రి, పర్వీన్, భారతి పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు కండీషన్‌లో ఉండాలి


స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీ రాజశేఖర్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల బస్సులు కండీషన్‌లో ఉండాలని మోటారు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎంవీ రాజశేఖర్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. సోమవారం డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బస్సుల కండీషన్‌ను పరిశీలించారు. అనంతరం డ్రైవర్లకు సీపీఆర్ గురించి ప్రథమ చికిత్స గురించి తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల యజమాన్యానికి సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన సీనియర్ డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బస్సుల కండీషన్, టైర్లు హెడ్‌లైట్లు బాగుండాలని, అత్యవసర సమయంలో పిల్లలు దిగడానికి వీలుగా బస్సు ఫుట్‌బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్సు అగ్నిమాపక రక్షణ పరికరాలు లేక పోతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వమని చెప్పారు. కర్నూలు చెందిన 40 స్కూల్ బస్సులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి: సీఐటీయూ

కర్నూలు రూరల్ జూన్ 30(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో తొలగించిన ఆర్టీసీ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు రాముడు, దేవరాజు, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో దాదాపు 11 మంది కార్మికులను ఆర్టీసీ అధికారులు తొలగించారని ఎంపీకి వివరించారు. ఎంపీని కలిసిన వారిలో సీఐటీయూ నాయకులు నాగరాజు, శేకున్, దేవానంద్, రాజు, కృష్ణన్న, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కల్లూరు సొసైటీ చైర్మన్‌గా శేఖర్ నియామకం

కల్లూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా పర్లశేఖర్ నియామకమయ్యారు. సోమ వారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరితను పర్ల శేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏపీ అర్బన్ డెవలప్మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ డి.రామాంజనేయులు హాజరయ్యారు. పర్లశేఖర్ మాట్లాడుతూ కల్లూరు సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కల్లూరు సహకార సంఘం చైర్మన్ నియామకానికి కృషి చేసిన గౌరు దంపతులు, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

స్కూల్‌కు రహదారిని నిర్మించాలి

కోడుమూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు రోడ్డు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డీఈవో శ్యామూల్‌పాల్‌ను కోరారు. ఎంఈవో 2 తైమూర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన సోమవారం హాజరయ్యారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి మాట్లాడుతూ మోడల్ స్కూల్‌కు రోడ్డు లేకపోవడం వలన పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అనంతరం డీఈవోకు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు అల్తాఫ్ పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ కళాశాల హాస్టల్‌లో మెనూను సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బిర్లాగేటులోని సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు తులసిదేవికి వారు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు దగ్గరలో ఉన్న కాలేజీలో హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకా రంగా భోజనం అందించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్, హాస్టల్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

గూడూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని నూతన సింగిల్ విండో చైర్మన్ బోజుగు దానమన్న అన్నారు. సోమవారం గూడూరులో దానమన్నను పలువురు టీడీపీ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దానమన్న మాట్లాడుతూ జిల్లా కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో తనకు గూడూరు సింగిల్ విండో చైర్మన్‌గా పదవి వరించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ తన సొంత నిధులతో 400 స్టీల్ ప్లేట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లి సురేంద్ర, ఎన్‌సీసీ అధికారి దాసరి సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూపల్లె ఎల్లారెడ్డి అందరికీ ఆదర్శం


జూపల్లె ఎల్లారెడ్డికి నివాళులర్పిస్తున్న శిష్యులు, కుటుంబ సభ్యులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మిడుతూరు రిటైర్డు హెడ్ మాస్టర్ జూపల్లె ఎల్లారెడ్డి అందరికీ ఆదర్శమని రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జే.రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఎస్‌ఆర్‌పేటలోని రేణుకా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జూపల్లె ఎల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్ర మానికి మిడుతూరు నుంచి ఆయన శిష్యులు హాజరయ్యారు. ఈసం దర్భంగా కుమారుడు డాక్ట ర్ జే.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడిగా ఎల్లారెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. అనంతరం డాక్టర్లు జే.రఘు నాథ్ రెడ్డి, రాజేశ్వరి దేవి, వెంకటేశ్వరరెడ్డి, సురేష్ రెడ్డి, శిష్యులు, హాస్పిటల్ సిబ్బంది జూపల్లె ఎల్లారెడ్డికి నివాళులర్పించారు.

రోడ్డు వెడల్పునకు సహకరించాలి: మంత్రి

కర్నూలు హాస్పిటల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ వద్ద రోడ్డు వెడల్పునకు సహకరించాలని షాపుల యజమాను లను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కోరారు. సోమవారం మెడికల్ కాలేజీ బయట షాపులు ఉన్న ప్రాంతాన్ని మంత్రి పరిశీ లించారు. ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పలువురు మృతి చెందిన విషయాన్ని యజమానులకు మంత్రికి వివరించారు. ఈ షాపులు కోల్పోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా షాపులు ఇస్తా మని మంత్రి వివరించారు. 25 సంవత్సరాల పాటు నెలకు రూ.300 అద్దె చెల్లించేలా షాపులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల సేవలు ప్రశంసనీయం

కర్నూలు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బంది సేవలు ప్రశంసనీయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం పదవీ విరమణ పొందిన 9 మంది పోలీసులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన డీపీవో సూపరింటెండెంట్ ఎస్.భాగ్యలక్ష్మి, పత్తికొండ ఎస్ఐ ఎస్టీ జమీర్, ఆదోని పీసీఆర్ ఎస్ఐ బి.శ్రీరాములు, డీటీసీ కర్నూలు ఎస్ఐ సి.వెంకటరమణ, ఏఆర్ ఎస్ఐలు బి.శ్రీనివాసులు, ఎం.బందే నవాజ్, కర్నూలు పీసీఆర్ ఏఎస్ఐ పీఆర్ సులోచన రాణి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వి.గోవిందరాజులు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్స్ డి.హుశేనయ్యలను ఎస్పీ పూలమాలతో సత్కరించారు. ఏఆర్ అడిషినల్ ఎస్పీ అడ్మిన్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు, ఆర్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. దీంతో రాకపోకలు స్తంభించాయి. పోలీసులు రంగప్రవేశం చేసి రైతులు, సంఘం నాయ కులను సము దాయించి సునయన ఆడిటోరియంలోకి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరసంజన్న. ఉపాధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ ఆయాలు, వాచ్‌మెన్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్ల కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఐదు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు.

ఆడ పిల్లలకు చదువు ఎంతో ముఖ్యం

కర్నూలు హాస్పిటల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ జి.సుధాకర్ అన్నా రు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీలో ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 జి.విమలమ్మను సన్మానించారు. డాక్టర్ జి.సుధాకర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు విధి నిర్వహణలో అంకిత భావంతో విమలమ్మ పని చేశారన్నారు. అనంతరం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయి పదవీ విరమణ పొందిన విమలమ్మను సన్మానించారు. నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, ఉపాధ్య క్షురాలు జి.శాంతి భవాని, కోశధికారి లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు సోమేశ్వరి, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు ప్యాకల్టీ పాల్గొన్నారు.

పాఠశాల మూసివేతను నిలిపి వేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలంలోని గుత్తి ఎర్రగుడి గుండాల తాండ ప్రాథమిక పాఠశాల మూసివేతను నిలిపేయాలని గ్రామస్థులు కోరారు. సోమవారం జిల్లా పరిషత్‌లో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో సుమారు 20 నుంచి 30 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరామన్నారు.

సర్వీసు రోడ్లు వేయకపోతే ఉద్యమిస్తాం: సీపీఐ

ఓర్వకల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సర్వీసు రోడ్లు వేయకపోతే ఉద్యమిస్తామని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని నన్నూరు టోల్ ప్లాజా మేనేజర్ రవిరం జన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఓర్వకల్లులో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సుబ్బారెడ్డి హోటల్ డాబా వరకు సర్వీసు రోడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణిలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇటీవలే విద్యార్థులు వెళ్తన్న ఆటోను లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రాజు, శివ, అయ్యప్ప, విష్ణు పాల్గొన్నారు.

ప్రజలు విద్యావంతులు కావాలి

కర్నూలు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు విద్యావంతులు కావాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల ప్రవీణ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ సూళ్లకు పోటీగా తీర్చుతున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యారంగం నాశనమైందన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని విద్యాశాఖాధికారులు అరికట్టాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే విద్యాసంస్థలపై చర్యలు తీసుకో వాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శంకర్, శ్రీకాంత్, ధనుజయ్ పాల్గొన్నారు.

'లీజు' పేరిట కన్నేశారు..!

(5వ పేజీ తరువాయి)

ఆ భూములకు సమీపంలో వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామం ఉంది. తాతలు, ముత్తాతల కాలం (దాదాపు 70-80 ఏళ్లు) నుంచి ఖాళీగా ఉన్న ఆ భూములను సాగు చేసుకుంటూ పేదలు జీవనం సాగిస్తున్నారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా పాలకులను విన్నవిస్తున్నారు. ఎన్నికల వచ్చిన ప్రతిసారి తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. 2005లో అప్పటి ప్రభుత్వం పేదల సాగులో ఉన్న భూములను అసైన్డ్ చేసి అర ఎకరా, ఎకరం, రెండెకరాలు చొప్పున దాదాపు 200 మందికి 276 ఎకరాలు డి-పట్టా ఇచ్చింది. యాజమాన్య హక్కు కల్పిస్తూ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. భూమిపై హక్కు రావడంతో భూమి లేని నిరుపేద కూలీలు ఆనందించారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని బోరుబావులు తవ్వకున్నారు. కంది, పత్తి, శనగ, వాము.. వంటి పంటలు సాగు చేసుకుంటూ, మిగిలిన సమయంలో కూలీ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కొందరు రైతులు మామిడి వంటి ఉద్యానవనం తోటలు సాగు చేస్తున్నారు. ఆ భూములు మూడు తరాలు వంశపార్యం పరంగా సాగు చేస్తూ వస్తున్నారు. ముందస్తు వర్షాలు కారణంగా ఈ ఏడాది కూడా ఇప్పటికే వివిధ పంటలు సాగు చేస్తున్నారు.

లీజు పేరిట వాలిన పెద్దలు

ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు గుండె దడ పుట్టించే వార్త తెలిసి ఆందోళన చెందుతున్నారు. యాపర్లపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 238లో 72 హెక్టార్లు (180 ఎకరాలు) 2004లో ప్రభుత్వం మైనింగ్ లీజు ఇచ్చింది. అయితే 'ఐరన్‌ఓర్ వంటి ఖనిజాలను వెలికితీత పనులు చేపట్టబోతున్నాం.. ఈ భూములు మావి.. ఖాళీ చేయాలి' అని చిట్టి సీతారాముడు అనే వ్యక్తి ఆ భూముల్లో వాలిపోయారని, ఆయన వెనుక పెద్దలు ఉన్నారని పేద రైతులు వాపోతున్నారు. ఇన్నేళ్లుగా సాగులో ఉన్న తమను వెళ్లిపొమ్మంటే ఎలా..? ప్రాణాలైనా వదులుతాం.. భూములు వదులుకోబోమని ఏకరువు పెడుతున్నారు. ప్రభుత్వం 2004లో ఆయనకు మైనింగ్ లీజుకు ఇస్తే.. అదే ప్రభుత్వం 2005లో అసైన్డ్ చేసి అప్పటికే సాగులో ఉన్న తమకు డి-పట్టాలు ఇచ్చిందని, అయితే అప్పుడే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. 2004లో లీజుకు తీసుకుంటే ఇన్నాళ్లు ఎందుకు మైనింగ్ చేయలేదని, ఇరబై ఏళ్ల తరువాత వచ్చి 'లీజు' ఉంది.. ఖాళీ చేయాలంటే ఎలా..? ఇది ఎంత వరకు న్యాయం? అంటూ ప్రశ్నిస్తున్నారు. పుల్లగుమ్మి గ్రామస్థులు ఆటోలు, వాహనాల్లో సోమవారం కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకుని, తమ భూములు కాపాడి న్యాయం చేయాలని గర్జించారు. ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదికలో జేసీ బి.నవ్యకు ఫిర్యాదు చేయగా, విచారించి మీ భూములు మీకే చెందెలా చూస్తామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు.

మూడు తరాలుగా సాగులో ఉన్నాం



మా ఊరికి దగ్గర్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. మా ముత్తాత, తాత, మా నాన్న ఈ భూమిపై ఆధార పడి జీవించారు. ఇప్పుడు నేను సాగు చేసుకుంటున్నాను. 2005లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబరు 238/ఏలో ఎకరం డి-పట్టా ఇచ్చింది. వారసత్వంగా వచ్చిన పట్టా భూమి రెండెకరాలు ఉంది. బోరుబావులు తవ్వకొని వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 2004లో ప్రభుత్వం మైనింగ్ లీజు ఇచ్చింది.. ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే ఎలా?. ఆ భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నాం. **- ఎస్.శ్రీనివాసులు, పుల్లగుమ్మి గ్రామం, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా.**



ప్రాణాలు పోయినా భూములు వదులుకోం

ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్నాం. ఆ భూమే మాకు జీవనాధారం. ప్రభుత్వం సర్వే నంబరు 238/ఏలో డి-పట్టా కూడా ఇచ్చింది. మాకు ఉన్నదే ఆరెకరాలు. మాకు లీజు హక్కు ఉంది. వెళ్లిపోండంటే ఎక్కడికె ళ్లాలి. మా ప్రాణాలు పోయినా సరే జీవనాధారమైన భూములను మాత్రం వదులుకోం. **- లక్ష్మీదేవి, పుల్లగుమ్మి గ్రామం**

ప్రభుత్వం డి-పట్టా ఇచ్చింది



కూలీకి వెళ్తే తప్ప పూట గడవని పేదరికం మాది. ఊరి పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ, మిగిలిన సమయంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాం. 2005లో ప్రభుత్వం అసైన్డ్ చేసి 2.5 ఎకరాలకు డి-పట్టా ఇచ్చింది. 2004 నుంచి 2060 వరకు ప్రభుత్వం లీజుకు ఇచ్చిందని సీతారాముడు అనే వ్యక్తి వచ్చారు. భూములు లాక్కుంటామంటే అక్కడే ప్రాణాలొదుతాం. కలెక్టర్ మాకు న్యాయం చేయాలి. **- తెలుగు రామచంద్రుడు, పుల్లగుమ్మి**



ఇప్పుడొచ్చి మా భూములు అంటున్నారు

యాపర్లపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 238/ఏ1లో 2 ఎకరాలు మా అమ్మ టి.వెంకటమ్మ పేరిట డి-పట్టా ఇచ్చారు. బోరుబావులు తవ్వకొని పంటలు, మామిడి సాగు చేస్తున్నాం. దశాబ్దాలుగా సాగులో ఉంటే.. ఇప్పుడొచ్చి భూములు మావి.. మైనింగ్ లీజు ఉందంటున్నారు. భూములను వదులుకోం. **- టి.జనార్దన్, పుల్లగుమ్మి**

గ్రామసభ పెట్టి చర్చిస్తాం

యాపర్లపాడు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు 1,500 ఎకరాలకు పైగా ఉన్నాయి. సర్వే నంబరు 238/ఏలో అసైన్డ్ చేసి పేదలకు డి-పట్టా ఇచ్చిన మాట నిజమే. సీతారాముడు అనే వ్యక్తి 75 హెక్టార్లు మైనింగ్ లీజు ఉందని మా దృష్టికి తెచ్చారు. గ్రామ సభ ఏర్పాటు చేసి చర్చించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తాం. **- నాగరాజు, తహసీల్దారు, కల్లూరు**

ఎన్‌ఎస్‌టీఆర్‌లోకి నో ఎంట్రీ

- నేటి నుంచి అమలు
- మూడు నెలల పాటు పర్యాటక కేంద్రాలు క్లోజ్
- నల్లమలలో జంగిల్ సఫారీలకు బ్రేక్
- ఇష్టకామేశ్వరీ, రుద్రకోడూరు క్షేత్రాలకు రాకపోకలు బంద్



ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్‌ఎస్‌టీఆర్) పరిధిలో జనసంచారాన్ని పూర్తిగా నిషేధించనున్నారు. పులుల సంరక్షణకు సంబంధించి ఏ సున్నితమైన అంశాన్ని కూడా దూరదృష్టితో ఆలోచిస్తూ అటవీ అధికారులు ముందుకెళ్తుంటారు. ఈక్రమంలోనే పులుల సంతాన ప్రక్రియకు వర్షాకాల సీజన్ అనుకూలం కావడంతో మూడు నెలల పాటు ఎన్‌ఎస్‌టీ ఆర్‌లోకి ప్రజలు రాకుండా నిషేధిస్తున్నారు.

వేటను మరిచి మమేకం..

పెద్దపులులు జతకలిసే విధానం వైవిధ్యంగా వుంటుంది. ఆడ, మగపులుల మూత్రం వాసనలు భిన్నంగా వుంటాయి. ఈక్రమంలోనే ఎప్పుడైతే ఆడపులి జతకలవాలని కోరుకుంటుందో ఆసమయంలో తన మూత్రవిసర్జనతో మగపులికి సంకేతాలు పంపిస్తోంది. అదే సమయంలో మగపులులు కూడా జతకలిసేందుకు ఉద్వేగంగా ఉండటంతో ఆడపులి మూత్రం సంకేతాలను గమనించి జతకలిసే ప్రయత్నం జరుగుతోంది. ఎప్పుడైతే పులుల మధ్య సంపర్కం మొదలవుతుందో అప్పటి నుంచి మూడు నుంచి ఐదురోజుల పాటు రెండుపులులు వేటను మరిచి సంపర్కంలో మమేక మవుతాయి. ఈవ్యవధిలో సుమారు వందసార్లకు పైగానే పెద్దపులుల ఇష్టంతో సం పర్కం చెందుతాయి. ఇవి జతకలిసే ప్రదేశాలు వీలైనంతవరకు నీటివనరులు వున్న ప్రాంతాలను ఎంచుకుం టాయి. ఉద్వేగంతో జతకలిగిన అనంతరం మగపులి శరీరం బాగా వేడెక్కుతుంది. శరీరాన్ని చల్లబరు చుకునేందుకు అవి నీటిలోకి వెళ్లి సేద తీరుతాయి. ఇదిలా ఉంటే తనివి తీరా జతకలిసిన ఆడపులి మరో కొన్ని నెలల పాటు సంపర్కం చెందేందుకు ఇష్టపడదు.

2023 లెక్కల ప్రకారం..

2023 పులుల లెక్కింపు ప్రకారం భారత్‌లో 3167 ఉన్నట్లు అంచనా వేశారు. వాస్తవానికి జూలై నుంచి సెప్టెంబరు వరకు ఆడపులు లు గర్భం దాల్చేందుకు అనువైన రోజులుగా పరిగణిస్తారు. వీటి గర్భాధారణ సమయం 16వారాలు వుంటుంది. ఒక ఈతలో సుమారు ఒక కిలో గల రెండు నుంచి నాలుగు కూనలకు ఆడపులి జన్మనిస్తోంది. ఇవి గుడ్డిగా, నిస్సహాయంగా జన్మిస్తాయి. దట్టమైన ప్రాంతాలు, రాతిపగుళ్ల వంటి ప్రాంతాల్లో వాటిని ఉంచి ఆడపులులు ఆహార సేకరణకు వెళ్తాయి. పూర్తిస్థాయిలో పులికూనల సంరక్షణ ఆడపులుల పెంపకంలోనే ఉంటాయి. మరణాల రేటు పులుల్లో అధికంగా వుంటుంది. సగం కంటే ఎక్కువ పులులు రెండేళ్ల కంటే ఎక్కువగా బతకలేవని తెలిసింది.

అనుమతుల నిరాకరణ

మూడు నెలల పాటు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని ప్రముఖ పుణక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు కూడా జనానికి అనుమతించరు. ప్రత్యేకించి మార్కాపురం అటవీ డివిజన్‌లోని ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయం, వెలుగోడు రేంజ్‌లోని రుద్రకోడూరు క్షేత్రం, గుండ్లబ్రహ్మేశ్వర్యం క్షేత్రాలకు వెళ్లేందుకు అనుమతులను నిరాకరించారు. ఆత్మకూరు డివిజన్‌లోని బైర్లూటి, నంద్యాల డివిజన్‌లోని పచ్చర్ల, మార్కాపురం డివిజన్‌లోని తుమ్మల బయలు ఏకోటూరిజం కేంద్రాలు కొనసాగనున్నప్పటికీ జంగిల్ సఫారీలకు బ్రేక్ వేశారు. ఈసమయంలో కర్ణాటక భక్తులు కొందరు శ్రీశైలానికి అటవీమార్గంలో పాదయాత్రగా వెళ్తుంటారు. అలాంటివారికి అనుమతించమని అధికారులు చెబుతున్నారు.

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుఫారెస్ట్‌గా..

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్ -శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82 చ.కి. మీలు విస్తరించింది. ఎన్‌ఎస్‌టీఆర్‌లో 2023లో పెద్దపులుల గణాంకాల ప్రకారం 75వుండగా ప్రస్తుతం పులికూనలతో కలిపి 87పులులు ఉన్నట్లు అధికారుల అంచనా వేశారు.

జన సంచారం నిషేధించాం

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా పులుల ప్రత్యుత్పత్తిలో భాగంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో జన సంచారాన్ని పూర్తిగా నిషేధించాం. వర్షాకాలంలో అనుకూలమైన ఈ మూడు నెలల్లో పులులు సంపర్కం చెంది వాటి సంఖ్య వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది.
- కృష్ణమూర్తి, ఎఫ్‌డీపీటీ, ఎన్‌ఎస్‌టీఆర్

కందనవోలుది ఘనకీర్తి

(5వ పేజీ తరువాయి)

జిల్లానుంచి విద్యారంగం, రాజనీతిలో ఆర్కాట్ లక్ష్మణ స్వామి మొదిలియార్, ఆర్కాట్ రామస్వామి మొదలియార్ సోదరులు, పారిశ్రామికవేత్తగా ఎమ్మిగనూరు మాచాని సోమప్పలు 1954లో భారత ప్రభుత్వం నుంచి ప్రప్రథమంగా పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతిగా, పీవీ నరసంహారావును ప్రధానిగా దేశానికి పంపించారు. తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య, ఉమ్మడి ఏపీకి రెండు పర్యాయాలు సీఎం బాధ్యతలు చేపట్టిన దివంగత నేత కోట్ల విజయ భాస్కరరెడ్డి, బీహార్, పంజాబ్ గవర్నర్‌గా పని చేసిన పెండేకంటి వెంకటసుబ్బయ్య జిల్లా వాసులేకావడం గర్వకారణం.

చరిత్రకు సింహద్వారం కర్నూలు

కర్నూలు జిల్లా ఘనచరిత్రకు సింహద్వారం. 167ఏళ్ల చరిత్ర మన సొంతం. ఆదిమానవులు నడియాడిన నేల. అశోకుడి శాసనాలు ఇక్కడ ఉన్నాయి. దేశానికి రాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్‌ను, రాష్ట్రానికి ముగ్గురు ముఖ్యమంత్రులను అందించిన జిల్లా కర్నూలు. రాజధానిగా సేవలు అందించి తెలుగుజాతి ఐక్యత కోసం రాజధానిని త్యాగం చేశాం. జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి.. చరిత్రను తరంవాళ్లకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



- ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్, వ్యవస్థాపకుడు, మానవశక్తి పరిశోధన కేంద్రం,

కర్నూలు త్యాగాలు, పోరాటాల గడ్డ



కర్నూలు జిల్లా ఆవిర్భవించి నేటితో 167 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఎన్నో త్యాగాలు, పోరాటలు చేసిన గడ్డ. స్వాతంత్ర్య పోరాటంలో సీమ పౌరుషం ఎలా ఉంటుందో బ్రిటీష్ పాలకులకు చూపించి గడ్డ. జిల్లా చరిత్ర చెరగనిది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తరువాత కర్నూలు వాసుల చేసిన త్యాగాలు గురించి నేటి పౌరువులకు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా అవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.
- చంద్రశేఖర్ కల్కూర, వ్యాపారవేత్త, కర్నూలు

నిర్మల చదువుకు సహకారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు కలెక్టరేట్/ ఆదోని రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద కుటుంబాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు ప్రారంభించిన పీ-4 కార్యక్రమం కింద నిర్మల అనే విద్యార్థినికి 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ హైదరాబాదు ఉచిత చదువు, వసతి భోజన సదుపాయాలతో మూడు సంవత్సరాల డిగ్రీ, ఐఏఎస్ కోచింగ్‌తోపాటు ఏడాది శిక్షణకు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. సోమవారం జేసీ చాంబర్‌లో హైదరాబాద్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ నిర్మలను అభినందించారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 'పీ-4' కింద దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం విద్యార్థిని నిర్మల మాట్లాడుతూ తన ఉన్నత చదువుకు సహకరిస్తున్న ఎంపీ నాగరాజు, జేసీ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమికి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.



నిర్మలతో ఐఏఎస్ అకాడమి ప్రతినిధులు

కోమాలోకి క్షతగాత్రుడు

చిప్పగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నగరడోణ గ్రామానికి చెందిన గొల్ల రంగస్వామి కోమాలోకి వెళ్లారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనమ మేరకు.. సైకిల్‌పై వస్తున్న గొల్ల రంగస్వామిని గ్రామానికి చెందిన అంజి, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ శనివారం రాత్రి ఢీ కొట్టారు. తీవ్రంగా గాయపడిన రంగస్వామి గుంతకల్లుకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ కోమాలోకి వెళ్లినట్లు రెండు రోజులు గడిస్తే కానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు అన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

ఆస్పరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలుపత్తికొండ గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్(35) సోమవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజుల క్రితం పిల్లలను తెర్నెకల్ హాస్టల్‌లో చేర్పించి బైక్‌పై వస్తుండగా కారుమంచి గ్రామ సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పార్వతి, కుమార్తెలు, కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అంగడి గోపాల్(ఫైల్)

తుగ్గలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో జరిగింది. తుగ్గలి మండలంలోని రామలింగాయపల్లెకు చెందిన అంగడి గోపాల్ (49) సొంత పొలం ఎకరన్నరతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కంది, సజ్జ, వేరుశనగ, ఆముదం, టమోటా తదితర పంటల సాగు కోసం రూ.8 లక్షలు పైగా అప్పు చేశారు. ఈ అప్పు ఎలా తీర్చాలోనని నిత్యం మనస్తాపం చెందేవారు. ఆదివారం రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్ర మించారు. అయితే సోమవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలో ఉన్న సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగారు. ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా నిర్జీవంగా పడి ఉండడంతో బోరున విలపించారు. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. గోపాల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రూపనగుడిలో వృద్ధురాలు..

ఉయ్యాలవాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రూపనగుడిలో చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. జగ్గమ్మ(75) రూపనగుడిలో నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఓకుమార్తెను మాయలూరు గ్రామానికి, మరో కుమార్తెను రుద్రవరం మండలం, ఆర్.నాగులవరం గ్రామాల్లో వివాహం చేశారు. కూతుర్లు తనను చూడటానికి రాలేదని మనస్థాపానికి గురై సోమవారం విష ద్రావణం నీళ్లలో కలుపుకొని ఆత్మహత్య చేసుకుంది. వాంతులు చేసుకుం టుండగా మనవడు ఓబులేసు గుర్తించి 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె కుమారుడు పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వజ్రం లభ్యం?

మద్దికెర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం దొరికినట్లు సమాచారం. బసినేపల్లిలో ఓ రైతు పొలంలో సోమవారం కలుపు మొక్కలు తొలగించే పనులకు కూలీలు వెళ్లారు. కలుపు మొక్కలు తొలగిస్తుండగా వజ్రం దొరికినట్లు తెలిసింది. ఆ వజ్రం బరువు 3 క్యారెట్లు ఉన్నట్లు సమాచారం. పెరవలి గ్రామనికి చెందిన వ్యాపారి రూ.2 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రద్దుకు పోరాడదాం

- తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



కర్నూలు న్యూసిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలందరూ ఐకమత్యంతో కలిసికట్టుగా పోరాడి వక్ఫ్ బోర్డు చట్ట సవరణను రద్దు చేసుకుందామని తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. సోమవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సేవ్ వక్ఫ్ సేవ్ కాన్సిటెన్సీ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్టీబీసీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ మౌలానా షోయబ్ సాబ్ అధ్యక్షతన జరిగింది. సభకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ షఫీఉల్లా రహమాని, జమా అతే అహలే హదీస్ అధ్యక్షుడు అబ్దుల్ రహిం ఖురామ్ హాజరయ్యారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ షఫీఉల్లా రహమాని మాట్లాడుతూ ముస్లిం సమాజం ఇతర ప్రజలను దళితులను, మైనార్టీలను, సెక్యులర్ వాదులను, రాజ్యాంగ ప్రేమికులను, న్యాయ నిపుణులను, కలుపుకుని ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ముస్లిం హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తీసుకువస్తుందన్నారు. ఈ దేశంలో ముస్లింలు తక్కువ జనాబా కలిగి ఉన్నారనే భావనను తొలగించుకోవాలని ఒక ఇరాన్, పాకిస్తాన్ కంటే కూడా ఈ దేశంలో ఎక్కువ మంది ముస్లిం సోదరులు ఉన్నారని అన్నారు. ఢిల్లీలో రైతులు చేసిన ఆందోళనలకు ప్రధాని నరేంద్ర మోదీ మూడు చట్టాలను రద్దు చేసి అందరికీ క్షమాపణ చెప్పిన విషయాన్ని అందరూ గుర్తు చేసుకోవాలన్నారు. సభలో జావలి సాహెబ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సయ్యద్ షా షఫీ పాషా సాహెబ్, ముక్తి సయ్యద్ మన్సూర్ సాహెబ్, ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ



పట్టణంలోని హనుమాన్ నగర్ కిలిచిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంకు మెట్లు పెచ్చులూడి కింద పడి వాటి ఇనుప కడ్డీలు పైకి కనిపిస్తున్నాయి. దీంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. పురపాలక అధికారులు ఓవర్ హెడ్ ట్యాంకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - ఆదోని అగ్రికల్చర్

బడికెళ్లాలంటే..



గ్రామాల నుంచి ఇలా ఆటోలో పరిమితికి మించి విద్యార్థులకు బడులకు వెళ్లడం కనిపిస్తోంది. విద్యార్థులు చదువుకునేందుకు ఆలూరుకు వచ్చి సాయంత్రం తిరుగు ప్రయాణం చేస్తుంటారు. సకాలంలో బస్సులు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రమాదకరంగా వెళుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని కోరుతున్నారు. - ఆలూరు

రీ సర్వే అక్రమాలపై విచారణ చేయాలి

పత్తికొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో చేసిన రీ సర్వే అక్రమాలపై విచారణ చేయాలని వైసీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో రీ సర్వే చేస్తున్నారని అయితే అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఎవరైనా డబ్బులు ఇస్తే ఒకరి భూమిని మరొకరికి మారుస్తూ సర్వేయర్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

ఆదోని అగ్రికల్చర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని విశ్రాంత ఎంఈవో శివరాములు అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద తుంబళం ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం ఎస్ఎండీ గౌస్ పదవీ విరమణ పొందడంతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎస్ఎండీ గౌస్ ఎక్కడ పనిచేసిన తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, స్నేహితులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉచ్చప్ప, ఉపాధ్యాయులు వరాహలమ్మ, చిరంజీవి రెడ్డి, ఏఈ మాలిక్, వెంకటేష్, ఈరన్న, హరిత, రాజేశ్వరి, సోమశేషాద్రి రెడ్డి, ఆర్‌మోహన్, జగదీష్, నాగేంద్రప్ప పాల్గొన్నారు.



హెచ్ఎం ఎస్ఎండీ గౌస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న తిరుపాల్ నాయుడు

తుగ్గలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లెలో రాతిదూలం పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు ప్రారంభించారు. కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో నిర్వహించే రాతిదూలం పోటీలకు 17 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు అందించారు. ధర్మకర్త జయన్న, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏకాశీ సూరన్న, హేమాద్రి నాయుడు, రామానాయుడు, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

మద్దికెర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సూచించారు. సోమవారం గ్రామంలోని వీధుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే దోమల సంతతి పెరిగి రోగాల బారిన పడే ప్రమాదముందని తెలిపారు. మేస్త్రీ లక్ష్మన్న, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థి మోనీ శ్రీబాలాజీకి ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేశారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికకావడంతో ఏడాది ఫీజు మొత్తం అందజేశారు. హెచ్ఎం ఫయాజుద్దీన్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనందుకు విద్యార్థిని అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు సునీల్ రాజ్ కుమార్, రమేష్ నాయుడు, రాజా సతీష్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను పునః ప్రారంభించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవనకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూతబడ్డ బీసీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రామాంజినేయులకు వినతిపత్రం ఇచ్చారు. హాస్టల్ లేక మండలంలో పేద విద్యార్థులకు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఇజాజ్, రాజశేకర్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న బీడీఎస్ఎఫ్ కన్వీనర్ రమేష్

ఆదోని అగ్రికల్చర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నోట్‌బుక్కులు, ఇంటర్ మెటీరియల్ విక్రయిస్తున్న ఆదోనిలోని ఓ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని బీడీఎస్ఎఫ్ కన్వీనర్ పగడాల రమేష్ కోరారు. సోమవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో జేసీకి వినతిపత్రం అందించారు.

ఇక ప్లాను మంజూరు సులువు

● ఇరుకు సందుల్లోని నిర్మాణాలకు నామమాత్ర రుసుంతో అనుమతినిచ్చిన ప్రభుత్వం



ఆదోని మట్కర్ వీధిలోని చిన్న సందు

ఆదోని టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ల మంజూరులో ఉన్న కఠిన నిబంధనల కారణంగా ప్లాన్ల సంఖ్య తగ్గిపోవడాన్ని గమనించిన ప్రభుత్వం సడలింపులు ఇస్తూ ఈనెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాత పట్టణం పరిధిలో అక్రమ కట్టడాల సంఖ్య తగ్గి అప్రూవల్స్ సంఖ్య పెరుగుతుందని పట్టణ ప్రణాళిక అధికారులు అంచనా వేస్తున్నారు.

కేవలం రూపాయితోనే అనుమతి

50 చదరపు మీటర్ల (1.2సెంట్లు) విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మించే నిర్మాణాలకు ఇకపై కేవలం రూపాయి చెల్లిస్తే ప్లాన్ మంజూరు చేసేలా వెసులుబాటు కల్పించారు. దీంతో పేద కుటుంబాల వారు సుళువుగా ప్లాన్ మంజూరు పొందే అవకాశం ఉంది. ఆదోనిలోని పాత పట్టణంలో చిన్న రహదారులు, సందులు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలకు అనుమతి కావాలంటే మున్సిపాలిటీకి స్థలం ఇచ్చే అవకాశం లేదు. దీన్ని గమనించిన ప్రభుత్వం నిబంధనను సడలించింది. 100 చదరపు మీటర్ల ప్లాట్‌కు రెండు మీటర్లు, అంతకన్నా ఎక్కువ ఉన్న ప్లాట్లకు 3.6 మీటర్ల మేర రోడ్డు ఉంటే ప్లాన్ మంజూరు చేయడానికి అవకాశం కల్పించారు.

ఫ్రంట్ సెట్ బ్యాక్‌లో మినహాయింపు

100 చదరపు మీటర్లలోపు ఉండే ప్లాట్లకు 3 మీటర్ల వరకు, 100 నుంచి 500 చదరపు మీటర్ల వరకు ఉన్న ప్లాట్లకు 0.75 నుంచి 2 మీటర్ల వరకు ఫ్రంట్ సెట్‌బ్యాక్ పాటిస్తే ప్లాను మంజూరు చేసేలా మినహాయింపు ఇచ్చారు. 3 మీటర్ల పైబడిన ఎత్తు భవనాలకు 5 అడుగుల వెడల్పుతో బాల్కనీ నిర్మించుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. దీంతో సామాన్యులకు ఊరట కలిగింది.

సామాన్యులకు ఊరట



ప్రభుత్వం ఇచ్చిన వినహాయింపులతో పాత పట్టణంలోని సామాన్యులకు ఊరట కలుగుతుంది. ప్లాన్ సుళువుగా మంజూరవుతుంది. అనధికార కట్టడాలు తగ్గిపోయే అవకాశం ఉంది. - బాల మద్దయ్య, టీపీవో, ఆదోని.

కమ్యూనిస్టులే మూడో ప్రత్యామ్నాయం

● సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సోమవారం సీఆర్ భవన్‌లో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. బీజేపీ వల్ల దేశ సమైక్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లిందని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన నాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఆవుల శేఖర్, నక్కిలేని బాబు, భీమలింగప్ప, నబిరసూల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

● మద్దికెర ఎంఈవో-2 మోహన్



మద్దికెర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈవో-2 మోహన్ హెచ్చరించారు. సోమవారం ఎంఈవో-2గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా రావాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంఈవో-2 గా బాధ్యతలు చేపట్టిన మోహన్‌ను ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

'ఉపాధి' లక్ష్యాలను పూర్తి చేయండి

దేవనకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో లక్ష్యాలను పూర్తి చేయాలని ఏపీడీ లక్ష్మన్న సూచించారు. సోమవారం ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో టీఏ, సీవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఈ ఏడాదికి నాలుగు వందల ఎకరాలలో పది రకాల పండ్ల తోటల్లో వందశాతం రాయితీతో 350 ఫాంపండ్స్ నిర్మించాలని నిర్దేశించామన్నారు. జూలై చివరిలోగా వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందిని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో రాజునాయక్, ఈసీ గంగన్న, టీఏలు కృష్ణమూర్తి, నాగన్న, నారాయణ, పెద్దయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

కార్యదర్శి సేవలు మరువలేం

హాలహర్వి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి ఈరన్న సేవలు మరువలేనివని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. సోమవారం ఈరన్న పదవీ విరమణ పొందడంతో మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ లింగన్న, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సహకరించిన వారికి కృతజ్ఞతలు

తుగ్గలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తనకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి చిన్న వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ చేయడంతో చిన్న వెంకటేశ్వర్లు దంపతులను ట్రైబల్ వెల్ఫేర్ సలహా కమిటీ సభ్యుడు వెంకటపతి, ఎంపీడీవో విశ్వమోహన్, ఈవోఆర్‌డీ శ్రీహరి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్ సన్మానించారు.

సేవలు ఆదర్శం

చిప్పగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎం, ఉపాధ్యాయుడిగా పనిచేసిన హనుమేశ్వర రావు సేవలు ఆదర్శమని ఎంఈవో సావిత్రమ్మ అన్నారు. చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో పదవీ విరమణ సభ నిర్వహించారు.

ఆలూరు ఏడీఏగా చెంగలరాయుడు



ఆలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆలూరు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చెంగలరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన సునీత డోన్‌కు బదిలీ కావడంతో తాడిపత్రి నుంచి ఆలూరుకు బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇస్తానని ఏడీఏ తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి

మద్దికెర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకుడు బురుజుల చెన్నకేశవులు, పంచాయతీ సభ్యుడు జమేదార్ జంబునాథ్ రాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, సాయినగర్ బాషా అన్నారు. సోమవారం మాట్లాడుతూ మండలంలో టీడీపీ వచ్చిన ఏడాదిలోపే దాదాపు రూ.10 కోట్ల అభివృద్ధి పనులు చేశారన్నారు. తెలిపారు. ఎమ్మెల్యే శ్యాంబాబు పత్తికొండ తాలుకాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు.

ఉద్యోగి కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

ఆదోని టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బదిలీల కౌన్సెలింగ్‌లో అస్వస్థతకు గురై మరణించిన మహిళా పోలీస్ ఉద్యోగి దివ్య కుటుంబానికి పరిహారం ఇవ్వాలని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. బదిలీల కౌన్సెలింగ్‌లను అర్ధరాత్రి వరకు నిర్వహించడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని విడతల వారీగా నిర్వహించాలని కోరారు.

వ్యక్తికి గాయాలు

ఆలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. సోమవారం ఆలూరు నుంచి కమ్మరచేడు గ్రామానికి బైక్‌పై వెళుతుండగా, అదుపుతప్పి, మొహంపై తీవ్ర గాయాలు కావడంతో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

హెచ్ఎం సేవలు మరువలేనివి

ఆస్పరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరుప్పల జడ్పీ పాఠశాల హెచ్ఎం గోపాలం అబ్రహం సేవలు మరువలేనివని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. సోమవారం హెచ్ఎం పదవీ విరమణ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరని, విధి నిర్వహణలో నిబద్ధతగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ బసవరాజు, వీరభద్ర, లక&న్న, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి



వినతులను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సూచించారు. మండలంలోని సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని..

- తన భర్త మరణించారని, ఆయన పేరుపై ఉన్న 847లో నమోదైన రెండు ఎకరాల భూమిని తన పేరుపై ఆన్‌లైన్‌లో మార్చాలని గోనెగండ్ల మండలం చిన్నమర్రి వీడు గ్రామానికి చెందిన పి.రోజ అర్జీ సమర్పించారు.
- తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, చిన్న కుమార్తె ప్రతిభ 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాయగా, 4990 ర్యాంకు వచ్చిందని, సీటు ఇప్పించాలని నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన సంసోను అర్జీ సమర్పించారు.
- జింకల పార్కు ఏర్పాటు చేసి పొలాలను కాపాడాలని రైతు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మల్లయ్య, అయ్యప్ప అర్జీ సమర్పించారు. డీఎల్‌డీవో బాలకృష్ణా రెడ్డి, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఐ ఆఫ్ సర్వే యర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫీ, బాలవర్ధిరాజు, ఏవో రమాదేవి, డీటీలు బాబు, రుద్రగౌడ్ పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



వెల్దుర్తిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్



ఆలూరులో మాట్లాడుతున్న ఎస్ఐ మహబూబ్‌బాషా

వెల్దుర్తి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ అశోక్ సూచించారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చేస్తే జైలుకు వెళ్లాల్సి వస్తోందని హెచ్చరించారు. చిన్నవయసులో ప్రేమ జోలికి వెళ్లకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాల న్నారు. డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని, 6 నెలల వరకు బెయిల్ కూడా రాదన్నారు. డ్రగ్స్ సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు కాల్‌చేసి సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

హాలహర్వి: బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్ఐ మారుతి సూచించారు. సోమవారం కస్తూర్బా పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌వో పద్మ పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం..

ఆలూరు: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మహబూబ్ బాషా సూచించారు. సోమవారం మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌కు వచ్చే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయరాదన్నారు. బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని, బాలికలు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్ననాయకులు

దోపిడీని అరికట్టండి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పుస్తకాల పేరుతో రూ.వేలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని ఆరోపించారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని, విద్యాశాఖ అధికారులు తనిఖీల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శేఖర్, శివ, వీరేష్, అంజి, మోహన్, శివరాం, కార్తిక్, యశ్వంత్ పాల్గొన్నారు.

31 యేళ్ల తర్వాత వచ్చాడు

● నాలుగేళ్లలో తప్పిపోయానంటున్న యువకుడు

● తల్లిదండ్రులను వెతికి పెట్టాలని సబ్ కలెక్టర్‌కు విన్నపం



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న వీరేష్

ఆదోని, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తనకు నాలుగేళ్ల వయస్సులో తప్పిపోయానని, తిరిగి తన తల్లిదండ్రుల కోసం ఆదోనికి వచ్చినట్లు వీరేష్ అనే యువకుడు తెలిపాడు. యువకుడి కథనం మేరకు.. 31 ఏళ్ల క్రితం తాను ముంబైకి రైలులో వెళ్లి అక్కడే హాస్టల్‌లో ఉండి చదువుకుని పెళ్లి కూడా చేసుకున్నాడు. అయితే తిరిగి తన ఊరు వెళ్లి తల్లిదండ్రులను కలుసుకోవాలని ఎదురుచూస్తూ వచ్చాడు. తన కళ్ల ముందు తల్లిదండ్రులు నాన్నమ్మల పలకరింపులే మెదులుతుండటంతో ఈనెల 26న ఆదోనికి చేరుకున్నాడు. నాన్న పేరు జనార్ధన్, నాన్నమ్మ అంజనమ్మ మాత్రమే గుర్తు ఉందని, తన తల్లిదండ్రులను వెతికి పెట్టాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు విన్నవించాడు. తనకు నాలుగేళ్ల వయస్సులో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తప్పిపోయాడు. తాను రైలులు ముంబైకి చేరాడు అక్కడ ఒక వసతిగృహం వారు చేరదీసి చదివించారు. పదో తరగతి వరకు చదివి, ఓ హోటల్‌లో పనిచేస్తూ డిప్లొమా పూర్తిచేశాడు. అక్కడే పరిచయమైన మద్రాసుకు చెందిన క్రిస్టెన్ ఫ్రాన్సిస్ అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పాత జ్ఞాపకాలు గుర్తుకు రావడంతో తల్లిదండ్రులను చూడాలన్న కోరికతో సోమవారం ఆదోనికి చేరుకున్నాడు. తనకు కుడికాలు విరగడంతో చిన్నప్పుడే శస్త్రచికిత్స చేశారని, తల్లిదండ్రులకు తెలుసని అని చెపకొచ్చాడు. అలాగే కుడి కన్ను కణతపై దెబ్బుందని, తన తల్లిదండ్రులకు అవి గుర్తున్నాయని ఆంధ్రజ్యోతికి వివరించారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా జరిగే మొహర్రంను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు గ్రామీణ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగ నూరు మండలంలోని 17 పంచాయతీల్లో మొహర్రంను ప్రతియేటా జరుపుకుంటున్నారన్నారు. అయితే ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మద్యంతాగి అల్లర్లకు పాల్పడినా, గొడవలు సృష్టించి ఘర్షణలకు దారితీసే ప్రయత్నం చేస్తే సహించేదిలేదన్నారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

'పదవీ విరమణ అనేది ఒక భావోద్వేగం'

మంత్రాలయం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏ ఉద్యోగంలో అయనా పదవీ విరమణ అనేది ఒక భావోద్వేగమని పలువురు అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్ పదేళ్లుగా ఉన్నతంగా తీర్చిదిద్దారని ఎంఈవోలు కొనియాడారు. సోమవారం కళాశాల ఆవరణంలో పదవి విరమణ పొందుతున్న రమేష్‌ను పూర్వవిద్యార్థులు అధ్యాపకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు ఖైనుద్దీన్, రాగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నందవరం: ఉద్యోగంలో పదవి విరమణ అనేది ఒక భావోద్వేగమైన భాగమని మాజీ జెడ్పీటీసీ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ముగతి ఈరన్నగౌడు అన్నారు. సోమవారం మండలంలోని ముగతి గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్న దేవీకృప పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. టీడీపీ గ్రామ అధ్యక్షుడు గుగ్గిరి నరసింహులు, వెంకటేష్ గౌడు, కొండారెడ్డి, కడుబూరి, అర్జున్‌యాదవ్, శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోసిగి: ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో అంకిత భావంతో పని చేసి తన ఉద్యోగ ధర్మాన్ని కాపాడాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి అన్నారు. కోసిగిలోని శ్రీశక్తి భవనంలో కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న కే.నాగేంద్ర పదవీ విరమణ కార్యక్ర మానికి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కోసిగి, ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐలు భార్గవ్ రెడ్డి, రమేష్ రెడ్డి, కోసిగి, ఎమ్మిగనూరు ఎస్ఐలు కార్తిక్ సాగర్, రాయుడు, కిషోర్ కుమార్, మునిరంగడు, భరత్, తిక్కయ్య, రవికుమార్ ఉన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా ఎర్రన్న

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ట్రాఫిక్ ఎస్ఐగా ఎర్రన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలో సంవత్సరానికి పైగా ట్రాఫిక్ ఎస్సై పోస్టు ఖాళీగా ఉండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్పందించిన అధికారులు కర్నూలులో విధులు నిర్వహిస్తున్న ఎర్రన్నను సాధారణ బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నియమనిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు నరేంద్రగౌడ్, బీటీఎస్ఎఫ్ తాలుకా నాయకుడు సుధాకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈవో1 రామాంజినేయులు, ఎంఈవో2 నీలకంఠకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘల నాయకులు శ్రీనివాసులు, శరత్, ఇలియాస్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం జులై 9న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రాజు అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వేణు, యాసిన్, రాఘవేంద్ర లు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎద్దుల మార్కెట్ దగ్గర అటుగా వస్తున్న ఆటో, బైక్ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చాకలి వీరేష్, ఉమా బైక్‌పై ఎమ్మిగనూరులోకి బస్టాండ్ వైపు వస్తుండగా, అటుగా వస్తున్న ఆటో అదే రోడ్డు వైపు ఎదురుగా వెళ్ళి బైక్‌పై వచ్చే వారిని ఢీ కొట్టి ప్రమాదానికి కారకుడయ్యాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'టెండర్లు పిలవడం విడ్డూరం'



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న హాలహర్వి రైతులు

కర్నూలు కలెక్టరేట్ / ఎమ్మిగనూరు జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు కేసు కొట్టివేయడంతో భూములు సాగు చేసుకునేందుకు ఇవ్వకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు తిరిగి టెండర్లకు పిలవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వక్ఫ్‌బోర్డు అధికారుల తీరును నిరసిస్తూ నందవరం మండలం హాలహర్వి గ్రామ రైతులు యాపిలయ్య, గుంటెప్ప, కౌలుట్ల స్వామి, నాగరాజు, అసురఖాన ముతావల్లి ముల్లా ఖాశీం సాహేబ్, మహబూబ్ బాషా, నజీర్ అహ్మద్, అల్లాబకాష్ సోమవారం జేసీ నవ్యకు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాలహర్వి గ్రామంలో సర్వేనెంబర్.254, 534, 887లో 85.83 ఎకరాల అసురఖానకు చెందిన వక్ఫ్ భూమి ఉందన్నారు. ఈ భూములకు 2021 జూన్ 30న టెండర్లు పిలవగా గ్రామానికి చెందిన తాము రూ.5,71,000 గుత్త చెల్లించే విధంగా వేలం పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. డబ్బులు కూడా డిపాజిట్ చేశామన్నారు. 2021 జూన్30న గ్రామానికి చెందిన కొంత మంది హైకోర్టును ఆశ్రయించడంతో అధికారులు భూములను రైతులకు సాగుకు ఇవ్వకుండా ఆపేశారన్నారు. దీనిపై వక్ఫ్‌బోర్డు అధికారులు సవాల్‌చేసి 2023లో కోర్టులో విజయం సాధించినట్లు తెలిపారు. అప్పటి నుంచి తాము భూములు సాగుకు ఇవ్వాలని పలుమార్లు వక్ఫ్‌బోర్డు అధికారు లను కలిసి విన్నవించినా వారినుంచి ఎలాంటి చలనం లేదన్నారు. తమకు వక్ఫ్ భూములను సాగుకు ఇవ్వకపోగా, తాము చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించకుండా కొత్తగా 2025 జూలై2న వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులను మోసంచేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ వేలం పాటలు నిర్వహించేందుకు సిద్ధమైన వక్ఫ్‌బోర్డు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ అమ్మకాలు చేసే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కన్వీనర్ మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు చందు, జాని, బుజ్జన్న, అనిల్, ప్రభు, అశోక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని గుడ్‌బేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నటరాజ్, కానిస్టేబుళ్లు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల భవన నిర్మాణాలు కలేనా?

● ఏడేళ్లుగా అద్దె భవనాల్లోనే వసతి గృహాలు ● ఎస్సీ బాలికలు, బాలుర హస్టళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ● నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే బీవీ వినతి

ఎమ్మిగనూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో పట్టణంలో ఉన్న ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హస్టళ్ల భవనాలు శిథిలమయ్యాయి. ఆ భవనాలు శిథిలమై ఏడేళ్లు గడుస్తున్నా అడిగే నాథుడే లేడు. దీంతో అధికారులు హాస్టళ్లను అద్దెభవనాల్లో కొనసాగిస్తువస్తున్నారు. అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు ఉంటు చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. శిథిలమైన హస్టళ్ల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రభుత్వానికి విన్నవించి నెలలు గడుస్తున్న నిధులు మంజూరు కాకపోవటంపై ఈఏడాది కూడా అద్దెభవనాల్లోనే కాలం వెల్లదీయకతప్పదని విద్యార్థులు ఆవేదనకు లోనవుతున్నారు.



ఎన్టీఆర్ కాలనీలో శిథిలమైన ప్రభుత్వ బీసీ, ఎస్సీ వసతి గృహాల భవనాలు



గుడికల్ రోడ్డులో అద్దెభవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర హాస్టల్

శిథిలమైన హాస్టల్ భవనాలు

ఎమ్మిగనూరులో ఒకప్పుడు అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రభుత్వ సంక్షేమ హస్టళ్లకు సొంతభవనాలు ఉండేవి. వాటిలో వందలాది మంది పేద విద్యార్థులు చదువుకునేవారు. హాస్టళ్లను ఏర్పాటు చేసిన నాటినుంచి వాటిని పర్యవేక్షించకపోవటం, మరమ్మత్తులకు నోచు కోకపోవటంతో ఆభవనాలు శిథిలమయి పాడుబడ్డాయి. ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో విద్యార్థులు కొంతకాలం భయం, భయంగా ఉంటూ వచ్చారు. శిథిలంకావటంతో వాటిలో ఉంటే ప్రమాదాలు జరుగుతాయోమోనని ఆందోళనతో అద్దెభవనాల్లోకి మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏడేళ్లుగా అద్దె భవనాల్లో

పట్టణంలో కొనసాగుతున్న బీసీ బాలుర, బీసీ బాలికల హాస్టళ్ల ఏడేళ్లుగా అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అద్దెభవనాలు కావటంతో ఉన్నవాటిలోనే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీ ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు పట్టణంలోని గుడికల్ రోడ్డులో వివిధ రెండు కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నాయి. ఈ రెండు హాస్టళ్లలో దాదాపు 180మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. అవసరమైన గదులు ఉన్నప్పటికి మరుగుదొడ్లు, స్నానపు గదులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అలాగే పట్టణంలో గీతానగర్‌లో ఉన్న రెండు బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక్కడ కూడా ఒక హాలుతో పాటు ఇరుకు గదులు, బాత్‌రూంలు ఉన్నాయి. ఈ హస్టళ్లలో సైతం దాదాపు240 మందికి పైగా బాలికలు గత ఏడాది వసతి పొందారు. ఈఏడాది ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే గోనేగండ్ల రోడ్డు, సున్నంబట్టి మసీదు ప్రాంతంలో ఉన్న రెండు బీసీమహిళల, బీసీ బాలుర వసతిగృహాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా బాల,బాలికలు ఈ అద్దెభవనాల్లో ఉండటం వల్ల చదువును ప్రశాంతంగా కొనసాగేపరిస్థితి కనిపించటం లేదు.

ఏర్పాటుకు నోచుకోని ఎస్సీ హాస్టల్

పట్టణంలో గతంలో ఎస్సీ బాలికల, ఎస్సీ బాలుర హాస్టళ్లు ఉండేవి. వాటిలో మూడు వందల మందికి పైగా బాల, బాలికలు మూడో తరగతినుంచి పదో తరగతి వరకు వసతి పొందుతూ చదువుకునేవారు. అయితే అప్పటి ప్రభుత్వం కొన్ని హాస్టళ్లను పూలింగ్ కేంద్రాల పేరుతో ఇతర ప్రాంతాల్లోని హాస్టళ్లలోకి కలిపేయటంతో ఎమ్మిగనూరులో ఎస్సీ హాస్టళ్లు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన బాల,బాలికలు హస్టళ్లలో చేరేందుకు ఇబ్బంది పడుతున్నారు. గోనేగండ్ల, నందవరం మండలాల్లో చేర్పించాలనుకుంటే అక్కడ కూడా ఇంటిగ్రేటేడ్, బీసీ బాలికల హస్టళ్లు కావటంతో ఎస్సీ బాల,బాలికలకు ఐదు మందికి మించి సీట్లు దొరకని పరిస్థితి. దీంతో ఎమ్మిగనూరులోని మూడు మండలాలనుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

● **నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే వినతి :**

ఎమ్మిగనూరు పట్టణంలో శిథిలమైన హస్టల్ భవనాల స్థానంలో కొత్తగా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి రాష్ట్ర సాంఘీకసంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులును ఈ ఏడాది మార్చిలో కలసి విన్నవించారు.

హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలి

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చాలా ప్రభుత్వ వసతిగృహాలకు సొంతభవనలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-వీరేష్‌యాదవ్,ఎన్ఎస్‌యుఐ, జిల్లా అధ్యక్షుడు.

జవాన్‌కు న్యాయం చేయాలి



వినతి పత్రం ఇస్తున్న గురురాజారావు దేశాయ్

నందవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జవాన్ షేక్ ఖలీల్ కుటంబానికి న్యాయం చేయాలని సామాజిక సేవ కార్యకర్త గురురాజారావు దేశాయ్ కోరారు. సోమవారం గురురాజారావు యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు షాదిక్ ఆధ్వర్యంలో నందవరం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో కాపలదారుడైన జవాన్ షేక్ ఖలీల్ తన తల్లి నబూభీ పేరు మీద 2 ఎకరాల పోలం ఉందని అందులో 1.32 సెంట్లు మాత్రం ఆన్‌లైన్‌లో ఎక్కిందని మిగతా పోలం చూపించడంలేదని తహసీల్దారు కార్యాలయంలో, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. మాజీ సర్పంచ్ రామన్నగౌడు, శివ, దానీయేలు, అబ్దుల్, సలీం,సుభాన్, విక్టర్, గని, సందీప్, వాజిద్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

ఎమ్మిగనూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకాన్ని వెంటనేఅమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రతిఘటన పార్టీ అనుబంధ సంస్థ పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బాలు, విజయ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమయానికి అన్నం పెట్టని వంట ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, హాజీబాబాలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ముందు విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ధర్నాకు దిగారు. కార్యక్రమంలో నాగరాజు, వీరస్వామి, రాజు, రంగస్వామి, రంగన్న, హర్షవర్ధన్, మల్లికార్జున, ఉమేష్, మహేష్‌లు పాల్గొన్నారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. సోమవారం ఆషాఢ పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో పండితులు ,అర్చకులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

● మంత్రాలయం పూర్వపు పీఠాధిపతులు వరధేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మహారాష్ట్ర లోని పూణేలో వెలసిన వరధేంద్ర తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'ఆ ఇద్దరికి' చేయూత

మంత్రాలయం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం తాండా మారుమూల ప్రాంతమైన గిరిజన గ్రామమైన తల్లి కూతుళ్లను (ఆ ఇద్దరిని) ఆదుకునేందుకు శాశ్వత పరిష్కారానికి టీడీపీ, వైసీపీ, అధికారులు పరిష్కారం చూపుతున్నారు. అదే విధంగా మానవత్వంతో దాతలు ముందుకువచ్చి వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డిలు తల్లి కూతుళ్ల కష్టాలను తెలుసుకుని వారు చెట్టుకింద ఉన్న స్థలాన్నే దాదాపు ఒకటిన్నర సెంటును కొనుగోలు చేసి వారి పేరు మీదనే రిజిస్ట్రర్ చేయించి ఇల్లు కట్టుకునేందుకు హామీ ఇచ్చారు. అదే విధంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి తనయుడు రాకేష్‌రెడ్డి వారిని పరామర్శించి ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇంటిని త్వరగా పూర్తి చేయించి కీర్తిబాయి విద్యకు అన్ని విధాలా సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమ్రేష్ నాయక్, నారాయణ్ నాయక్, రాజా నాయక్, లింగప్ప, నారాయణ నాయక్, చంద్ర, ముని నాయక్ పాల్గొన్నారు.

కేడీసీసీ ద్వారా రైతులకు సేవలందించాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



కేడీసీసీ బ్యాంకు చైర్మన్లను, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని సన్మానిస్తున్న నాయకులు

మంత్రాలయం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి రైతులకు సేవలందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో తన నివాసంలో నాలుగు మండలాల కేడీసీసీ చైర్మన్లు, మెంబర్లు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా పూలమాలలు, శాలువలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలయం నుంచి రామకృష్ణారెడ్డి, కల్లుదేవకుంట బోయ రాగమ్మ, వెంకటపతిరాజు, అయ్యన్న, మారెప్ప, అంజినేయ, నరసప్ప, మెంబర్లు నరసింహ, నబీసాబ్, సోమనాథ్, లక్ష్మన్నలు పూలమాలతో సత్కరించారు. మంత్రాలయం నియోజకవర్గంలోని నూతనంగా ఎన్నికైన ఏడు మంది సింగిల్ విండో చైర్మన్లను, 14 మంది మెంబర్లుతో పాటు నాయకులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసి సంక్షేమ పథకాలు అందేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పదవులు తీసుకుని సేవలు చేయకుండా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉలిగయ్య, రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, అడివప్పగౌడు, టిప్పుసుల్తాన్, రాజానంద్, లక్ష్మన్న, సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ స్టోర్స్ ఎన్నికలు వాయిదా

ఎమ్మిగనూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ది ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ స్టోర్స్ ఎన్నికలను నిలుపుదల చేస్తు కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం ఆదేశాలు జారీ చేశారు. స్టోర్స్ ఎన్నికలపై 2015లో కోర్టుకు వెళ్లటంతో నిలిచిపోయాయి. ఎక్కడ నుంచి ఎన్నికలు నిలిచిపోయాయో తిరిగి అక్కడనుంచి ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వటంతో అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు నోటీఫికేషన్ జారీ చేశారు. జూన్ 30న నామినేషన్ల పరిశీలన ఉండగా జూలై 8వ తేదీన ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఎన్నిలక తేది సమయంలో మొహర్రం ఉండటంతో పోలీసులు అక్కడే బందోబస్తులో ఉంటారని స్టోర్స్ ఓటింగ్‌కు బందోబస్తు ఇచ్చేందుకు ఇబ్బందిగా ఉంటుందని ఎన్నికలను వాయిదా వేసుకోవాలని సూచిస్తు ఎమ్మిగనూరు పోలీసులు ఎన్నికల అధికారులకు నివేదిక ఇవ్వటంతో అధికారులు ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో తెలియజేస్తామని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎన్నికలు వాయిదా పడటంతో స్టోర్స్ చైర్మన్‌గా, సభ్యులుగా ఎంపికైన అధికారపార్టీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళ హత్య కేసులో భర్త అరెస్టు

మంత్రాలయం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన భార్య లక్ష్మీదేవిని అతికిరాతకంగా హత్య చేసిన వైసీపీ నాయకుడు బోయ హనుమంతును సోమవారం అరెస్టు చేసినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. జూన్ 26న తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్యను నాగలికట్టెతో కొట్టి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతురాలి తమ్ముడు బోయ శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం మాధవరం, మంత్రాలయం రోడ్డులోని సూగూరు క్రాస్ రోడ్డు వద్ద అభయాంజనేయస్వామి గుడి వద్ద రౌడీషీటర్ హనుమంతును అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా.. సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. హనుమంతును నాలుగు రోజుల్లో అరెస్టుచేసి జైలుకు తరలించడంపై డీఎస్పీ ఉపేంద్రబాబు మంత్రాలయం సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని అభినందించారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తట్టుకోలేక మహేష్(25) అనే యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి నీలమ్మ తెలిపిన వివరాల మేరకు, పట్టణంలోని సోగనూరు రోడ్డు అబ్బాస్ థియేటర్ దగ్గర నివాసం ఉంటూ దినసరి కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్న మహేశ్ తరచుగా కడుపు నొప్పితో బాధపడుతుండే వాడు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో నొప్పికి తట్టుకొలేక సోగనూరు రోడ్డులోని జెడ్పి స్కూల్ ప్రాంగణంలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు.

పొలంలోనే కుప్పకూలిన రైతు

మంత్రాలయం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన రైతు బాలరాజు(42)అనే రైతు తన పత్తి పొలంలో జంతి పట్టుతుండగా గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈసంఘటన ఆదివారం జరిగింది. తన పొలంలో భార్య, పిల్లలతో కలిసి జంతి పనులు చేస్తుండగా కిందపడిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా ప్రాణాలు వదిలాడు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో భార్యలు, పిల్లలు రోదిస్తున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

● వైసీపీ సభ్యులు, బీజేపీ సభ్యుడి మధ్య తీవ్ర వాగ్వాదం



వైస్‌చైర్మన్, బీజేపీ సభ్యుడు వాగ్వాదం చేసుకుంటున్న దృశ్యం

ఎమ్మిగనూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. వైస్ చైర్మన్, వైసీపీ సభ్యులు, బీజేపీ సభ్యుడు దయాసాగర్ మధ్య వాగ్వాదం జరగడంతో సమావేశం కాస్త రసాభాసగా మారింది. శాంతించాలని చైర్మన్ డా రఘు కోరినా ఎవరు పట్టించుకోకపోవటంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించి బయటకు వెళ్లిపోవటంతో సభ్యులు నిరుత్సాహానికి లోనయ్యారు. ప్రజల సమస్యలు పక్కన పెట్టి రాజకీయ ఆరోపణలు ప్రత్యారోపణలతో గందరగోలం ఏర్పడింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ డా. రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రారంభమైన కొద్దిసేపటికే వైస్ చైర్మన్ నజీర్ అజెండాలోని 35 అంశాలను ఆమోదిస్తున్నామని చెప్పారు. అలాగే బీసీ స్మశానవాటికలో గతంలో రోడ్డుకోసం చేసిన తీర్మాణాన్ని రద్దు చేస్తున్నామని చెప్పారు. అలాగే సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్ మాట్లాడుతూ బీసీ స్మశాన వాటికలో రోడ్డు రద్దు చేసేందుకు ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి చర్యలు తీసుకున్నారని, రహదారికి తీర్మానం చేసిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు సూచించటం వల్లే నేడు రహదారి రద్దు తీర్మాణాన్ని ప్రవేశపెట్టి రద్దు చేశారన్నారు. అనంతరం బీజేపీ సభ్యుడు వీజీపీ దయాసాగర్ మాట్లాడుతూ బీసీస్మశాన వాటికలో రోడ్డుకు అనుమతించిన తీర్మానాన్ని రద్దుచేయటం శుభపరిణామన్నారు. కౌన్సిల్‌లో బీజేపీ సభ్యులు లేరని, ఏపార్టీ నుంచి గెలిచావో.. చెప్పాలని బీజేపీ కండువా తీసి మాట్లాడాలని లేదంటే మూడు కండువాలు వేసుకోవాల అన్నారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సమావేశంలో వైస్‌చైర్మన్ దివ్యకళ, మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, టీపీఓ రాజేష్, ఏఈలు మదన్, శరత్ చంద్ర, శ్రీనివాసులు, కౌన్సిలర్లు నాగేశప్ప, స్వాతీ, రాజారత్నం బజారి, కేశవరెడ్డి, అంపమ్మ, వాహీద్, ఇసాక్, అమాన్‌లు పాల్గొన్నారు.

● **మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవటం దారుణం:**

కౌన్సిల్ సమావేశంలో ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు చైర్మన్ అవకాశం ఇవ్వకపోవటం సరైందికాదని టీడీపీ కౌన్సిలర్లు రామదాసు గౌడ్, స్వాతీ, ఇసాక్, అమాన్, వాహీద్‌లు అన్నారు.

● బీసీ స్మశానవాటికలో రోడ్డుకు అనుమతి ఇస్తు 2023లో కౌన్సిల్‌లో చేసిన తీర్మాణాన్ని సోమవారం కౌన్సిల్ సమావేశంలో సభ్యులు రద్దు చేస్తు తీర్మానించారు. అజెండాలో 31వ అంశాంగా పెట్టిన తీర్మాణాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో బీసీ స్మశానవాటికి పరిరక్షణ కమిటి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

● **కౌన్సిల్‌లో మొదటిసారి బీజేపీ సభ్యుడు:**

ఎమ్మిగనూరు పురపాలక సంఘం చరిత్రలో ఇప్పటి వరకు ఎవరు బీజేపీ తరుపున కౌన్సిల్‌లోకి వెళ్లింది లేదు. అలాంటిది ఇటీవలే టీడీపీని వీడి బీజేపీలో చేరిన కౌన్సిలర్ వీజీపీ దయాసాగర్ మొదటి సారి కౌన్సిల్‌లో బీజేపీ కండువాతో హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశం ముగిసిన తరువాత దయాసాగర్‌ను బీజేపీ నాయకులు లలిత్, తొగట నరసింహులు, జగ్గాపురం చిన్న ఈరన్న, బీఎల్ నారాయణ, బీఎస్ ఈరన్న, శ్రీనివాసులుతో పాటు పలువురు ఘనంగా సన్మానించారు.